## దైవ దర్శనానికి వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

16 తులాల బంగారం, రూ.25 వేల నగదు అపహరణ


తెరిచి ఉన్న బీరువా

రాజేంద్రనగర్: దైవ దర్శనానికి వెళ్లి వచ్చేసరికి ఇంట్లోని బంగారు ఆభరణాలతో పాటు నగదును దొంగలు ఎత్తుకెళ్లిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బండ్లగూడ వికాస్‌నగర్‌కు చెందిన నవీన్ కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం 10.30 గంటలకు ఇంటికి తాళం వేసి కర్ణాటకలోని దైవ దర్శనానికి వెళ్లారు. అనంతరం అదేరోజు రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటికి వచ్చి చూసేసరికి మెయిన్ డోర్ తెరిచి ఉంది. దీంతో కంగారుపడి లోనికి వెళ్లి చూడగా బీరువాలోని బట్టలు చిందర వందరంగా చేసి లాకర్ పగులగొట్టి ఉంది. అందులో ఉన్న 16 తులాల బంగారు ఆభరణాలు, రూ.25 వేల నగదు కనిపించలేదు. దీంతో నవీన్ రాజేంద్రనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## మహిళల ఆరోగ్యం కోసమే 'డిగ్నిటీ డ్రైవ్'



విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్‌లు అందజేస్తున్న షైన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు పరమేశ్వరి

శంషాబాద్: మహిళల ఆరోగ్యం కోసమే 'డిగ్నిటీ డ్రైవ్' కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని షైన్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ పరమేశ్వరి అన్నారు. మల్టీసార్బ్ సంస్థ సహకారంతో సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం శానిటరీ ప్యాడ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొంతమంది మహిళలు రుతుస్రావం సమయంలో సరైన శుభ్రత పాటించకపోవడంతో దేశవ్యాప్తంగా ప్రతి ఏడు నిమిషాలకో మహిళా సర్వైకల్ కేన్సర్ బారిన పడుతున్నారన్నారు. రుతుస్రావం విషయంలో మహిళలు బిడియం వీడాల్సిన అవసరముందని ప్రధానోపాధ్యాయురాలు సువర్ణ సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జగతి తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ సభకు తరలిన శ్రేణులు


మణికొండ నుంచి ప్రజా ఆశీర్వాద సభకు తరలివెళ్తున్న నాయకులు, కార్యకర్తలు

మణికొండ: చేవెళ్లలో బీఆర్ఎస్ శనివారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. మణికొండ మున్సిపాలిటీ నుంచి పార్టీ సమన్వయ కర్త , మాజీ ఎంపీపీ తలారి మల్లేశ్, పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు బి.శ్రీరాములు, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె. రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో, అలాగే పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆర్. నర్సింహ, మున్సిపల్ చైర్‌పర్సన్ డి.రేఖాయాదగిరి, వైస్ చైర్మన్ జి.వెంకటేశ్‌యాదవ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకుంటామని పేర్కొన్నారు.


గాలిదొడ్డి నుంచి మున్సిపల్ చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో..


నార్సింగి నుంచి మున్సిపల్ వైస్ చైర్మన్ ఆధ్వర్యంలో..

### రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి..

రాజేంద్రనగర్: చేవెళ్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన బహిరంగ సభకు రాజేంద్రనగర్ సర్కిల్ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. రాజేంద్రనగర్, శివరాంపల్లి, ఎర్రబోడ, అత్తాపూర్, సులేమాన్‌నగర్, చింతల్‌మేట్ ప్రాంతాల నుంచి ర్యాలీగా అత్తాపూర్ డివిజన్ అధ్యక్షుడు వనం శ్రీరాం రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు జయంత్ రెడ్డి, బంగి శ్రీను, మహేశ్, శివ, శ్రీకనివాస్, నగేశ్, రవి గౌడ్ ర్యాలీగా తరలివెళ్లారు.


చేవెళ్ల బహిరంగ సభకు తరలివెళ్తున్న నాయకులు

## ఆలయంలో లలితా సహస్రనామ పారాయణం


పారాయణంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: అత్తాపూర్ డివిజన్‌లోని హైదర్‌గూడ ప్రణవభక్త సమాజం ఆధ్వర్యంలో చారిత్రక బాలాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి లలితా సహస్రనామ పారాయణం జరిగింది. ఈ కార్యక్రమంలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పసుపు, బొట్టుతో పాటు భజన చేశారు. ఈ సందర్భంగా నిరంతరం ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్న వారిని నిర్వాహకులు ఘనంగా సన్మానించారు.

## నార్సింగిలో మెజార్టీ సాధించాలి


ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

మణికొండ: పార్లమెంట్ ఎన్నికల్లో నార్సింగి మున్సిపాలిటీ నుంచి భారీ మెజార్టీ సాధించేలా కృషి చేయాలని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీకి చెందిన పార్టీ నాయకులు శనివారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వర్గాల ప్రజలతో పాటు గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలోని ప్రతిఒక్కరిని కలిసి చేతి గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించాలని సూచించారు. కలిసిన వారిలో రాష్ట్ర ఎస్సీ సెల్ నాయకుడు కిరణ్, నాయకులు వేణుగౌడ్, వినోద్‌కుమార్, రాము, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మితీమిరిపోతున్న ఆటోవాలాల ఆగడాలు..!


కాళీమందిర్ బస్టాప్ వద్ద రోడ్డుపైనే నిలిపిన ఆటోలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆటోవాలాల ఆగడాలు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయి. రోడ్లపై ఇష్టానుసారంగా ఆటోలు నిలిపేసి ప్రయాణికులు, ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నారు. ప్రజలు ఎక్కడ ఉంటే అక్కడ, వెనుక నుంచి ఏ వాహనం వస్తుందో కూడా చూసుకోకుండా ఆటోడ్రైవర్లు ఇష్టానుసారంగా కట్స్ కొట్టుకుంటూ వెళ్తున్నారు. దీంతో వెనకాల వచ్చే వాహనాదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అలాగే ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాప్‌లను ఏర్పాటు చేస్తే అక్కడ ఆటోలను నిలిపి ఆర్టీసీ బస్సులు ఆగకుండా చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు ఆటోవాలాల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.



## స్పోర్ట్స్ షాపులో అగ్ని ప్రమాదం

రూ.20 లక్షల ఆస్తి నష్టం



గచ్చిబౌలి: స్పోర్ట్స్ షాపులో జరిగిన అగ్ని ప్రమాదంలో రూ.20 లక్షల ఆస్తి నష్టం జరిగిందని మాదాపూర్ ఫైర్ ఆఫీసర్ ఫైజల్ తెలిపారు. కొత్తగూడ ప్రశాంత్‌నగర్‌లోని ప్రధాన రహదారిలో ఉన్న పవర్ మ్యాక్స్ ఫిట్‌నెస్ సెంటర్‌లో శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. షాపు మూసి వేసి ఉండటంతో షట్టర్ లోపలి నుంచి దట్టమైన పొగ రావడం గమనించిన ప్రజలు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది షట్టర్‌లను తెరచి మంటలు ఆర్పారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం చోటు చేసుకుందని ఆట వస్తువులు కాలిపోయాయని అధికారులు తెలిపారు.

### ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

అత్తాపూర్: కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన అత్తాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం .. అత్తాపూర్ నౌ నంబర్ ప్రాంతంలో మహమ్మద్ చాంద్‌పాషా (25) కుటుంబంతో కలిసి జీవిస్తున్నాడు. లేబర్ పనిచేస్తూ వ్యసనాలకు బానియ్యాడు. పలుమార్లు కుటుంబ సభ్యులతో గొడవలకు దిగుతున్నాడు. శుక్రవారం రాత్రి భోజనం చేసిన తరువాత భార్యతో గొడవ పడ్డాడు. దాంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. శనివారం ఉదయం వచ్చి చూడగా తలుపు తీయలేదు. అనుమానం వచ్చి కుటుంబ సభ్యులకు తెలపగా వారు వచ్చి తలుపు తెరిచి చూడగా ఇంట్లో ఉరేసుకుని కనిపించాడు. మృతుడి తల్లి అలియా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

## గంజాయి విక్రేత అరెస్ట్

250 గ్రాముల గంజాయి స్వాధీనం


గంజాయి ప్యాకెట్లతో బసవ రాజప్ప

గచ్చిబౌలి: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ ఆంజనేయులు తెలిపిన ప్రకారం వివరాలు.. సవదత్తి బసవ రాజప్ప(38) డ్రైవర్. గచ్చిబౌలి ఏపీ హెచ్‌బీ కాలనీలో నివాసం ఉంటూ కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్నాడు. దూల్‌పేట్ నుంచి గంజాయి కొనుగోలు చేసి వలస కూలీలు, ఐటీ ఉద్యోగులకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు రాజప్పను అదుపులోకి తీసుకున్నారు. 250 గ్రాముల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## విగ్రహ ప్రతిష్ఠకు రావాలని మంత్రికి ఆహ్వానం


మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వాన పత్రాన్ని అందజేస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ బుద్వేల్ శ్రీ కోట మైసమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపనకు హాజరుకావాలని కోరుతూ కమిటీ సభ్యులు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్‌ను శనివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన సమావేశంలో కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. కోట మైసమ్మ దేవత సింహ వాహన బలిపీఠం, పోతలింగం, శిఖర దేవత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలను ఈ నెల 19వ తేదీ నుంచి 21వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. వేద పండితులు రేపల్లె రాజు శర్మ చేతుల మీదుగా కార్యక్రమాలు జరగనున్నట్లు పేర్కొన్నారు. 19న తేదీన శుక్రవారం మహా గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమై 20వ తేదీన చండీయాగం తదితర పూజలు సాగుతాయన్నారు. 21న కోట మైసమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు శిఖర దేవతల యంత్ర ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం అమ్మవారికి బోనాల సమర్పణ ఉంటుందన్నారు. అలా గే ఆలయంలో అన్నదానం చేశామని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయా లని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేవదాస్ గౌడ్, నరసింహ గౌడ్, సత్యనారాయణ, పుంజాల నందన్, పెంటయ్య, రాములు యాదవ్, హరి చరణ్ గౌడ్, ఆనంద్ గౌడ్ ఉన్నారు.

## ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్ట్

గచ్చిబౌలి: కొండాపూర్‌లోని రాజరాజేశ్వరీనగర్‌లో ఉన్న సిల్వర్‌కీ లాడ్జి జూదానికి కేంద్రంగా మారింది. ఓ వైపు ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ మరో వైపు పేకాట నిర్వహిస్తున్నారు. గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌ను మాదాపూర్ ఎస్‌ఓటీ పోలీసులు ఛేదించారు. కొండాపూర్‌లోని రాజరాజేశ్వరీనగర్‌లోని సిల్వర్‌కీ ఓయో లాడ్జిలో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో ఎస్‌ఓటీ, గచ్చిబౌలి పోలీసులు దాడి చేశారు. లాడ్జిలోని 401 రూమ్‌లో బీఎస్ఎఫ్ఎల్ 666 బెట్టింగ్ యాప్ ద్వారా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారు. సబ్ బుకీ మాడపాటి బస్వరాజ్(26), పంటర్లు కొండాపూర్‌కు చెందిన అమన్‌చౌదరి(23), నేలం రవి(31)తెల్లాపూర్‌కు చెందిన మణికాంత్‌రెడ్డి(20)లను అదుపులోకి తీసుకున్నారు. ప్రధాన బుకీలు హఫీజ్‌పేట్‌కు చెందిన జీతుశర్మ, మాడిశెట్టి అజయ్ పరారీలో ఉన్నారు. ముగ్గురు పంటర్లను అదుపులోకి తీసుకొని కరూర్ వైశ్య బ్యాంక్, కోటక్ మహేంద్ర బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్‌లలో రూ.1,84,398 సీజ్ చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### పేకాటరాయుళ్ల అరెస్ట్


పేకాట ఆడుతూ పట్టుబడ్డ శ్రీకాంత్, కిరణ్, ప్రశాంత్ రెడ్డి తదితరులు

సిల్వర్ కీ ఓయో లాడ్జిలో పేకాట ఆడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు గచ్చిబౌలి సీఐ ఆంజనేయులు తెలిపారు. పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో మాదాపూర్ ఎస్‌ఓటీ, గచ్చిబౌలి పోలీసులు దాడి చేశారు. మసీద్‌బండకు చెందిన ఎం.శ్రీకాంత్(27), కొండాపూర్ ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఎస్.కిరణ్ (30), గచ్చిబౌలి ఇందిరానగర్‌కు చెందిన ఎస్.ప్రశాంత్ రెడ్డి(28) పేకాట ఆడుతూ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ప్రేమ్‌నగర్‌కు చెందిన ఆర్గనైజర్ ఎం.బస్వరాజ్(26) పరారీలో ఉన్నాడు. నిందితుల నుంచి ఏడు సెట్ల ప్లేయింగ్ కార్డ్స్, రూ.1.52 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# అసంపూర్తి పనులు.. అల్లుకుంటున్న గుర్రపుడెక్క

- గురున్నాథం చెరువులో సగంలోనే ఆపేసిన పనులు
- మళ్లీ విస్తరిస్తున్న వైనం.. పట్టించుకోని అధికారులు


మియాపూర్ గురున్నాథం చెరువులో సగం మేర తొలగించిన గుర్రపు డెక్క



మియాపూర్: గురున్నాథం చెరువులో గుర్రపుడెక్క తొలగింపు పనులు అసంపూర్తిగా చేసి వదిలేయడంతో తిరిగి అల్లుకుంటోంది. చెరువుల్లో గుర్రపుడెక్క తొలగింపుపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. గుర్రపు డెక్క తొలగించేందుకు లక్షల రూపాయలు నిధులు వెచ్చిస్తున్నా పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు అసంపూర్తి పనులతో సరిపెడుతున్నారని స్థానికులు వాపోతున్నారు. పైగా చెరువుకట్టలపై వేసిన గుర్రపుడెక్కను అక్కడ నుండి తొలగించకపోవడంతో అది మళ్లీ విస్తరిస్తోంది.

- మియాపూర్ గురున్నాథం చెరువులో గుర్రపుడెక్క ఏపుగా పెరిగిపోయింది. దీనిని తొలగించడంలో సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- రెండు నెలల నుంచి గుర్రపు డెక్కను యంత్రాల సహాయంతో తొలగించి తరువాత వదిలేశారు. చెరువులో కొంతభాగం తొలగించిన గుర్రపు డెక్కను చెరువు కట్టపై వేశారు. దీనిని అక్కడ నుంచి తొలగించకపోవడంతో తిరిగి చెరువులోకి చేరుతోంది.
- చుట్టు పక్కల కాలనీల నుండి వస్తున్న మురుగు నీరు చెరువులో చేరి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు ప్రబలుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి గుర్రపు డెక్కను పూర్తిగా తొలగించడంతో బాటు చెరువును శుద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### నాలాలు కబ్జా..



మయూరీనగర్, నడిగడ్డతండా, న్యూ కాలనీల పరిసర ప్రాంతాల నుండి వచ్చే వరదనీరు గురున్నాథం చెరువులో చేరుతోంది. చెరువుల్లో వరదనీరు చేరడానికి అందులో నుంచి కింది చెరువుకు వెళ్లేందుకు నాలా లేకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు వరద ముంపునకు గురవుతున్నారు. నాలాల ఆక్రమణ, నాలాలపై భవన నిర్మాణాలు జరగడం కాలనీల ముంపునకు ప్రధాన కారణం. గురున్నాథం చెరువు విస్తీర్ణం , చెరువు పై భాగంలో, కింది భాగంలో ఉన్న నాలాల పరిధి, విస్తరణను అధికారులు పట్టించుకోకపోవడంతో ఆక్రమణలకు గుర్తై కుంచించుకుపోయింది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.